క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



కొత్తపల్లి: మండల పరిధిలోని దుప్పటి గట్టు గ్రామానికి చెందిన గూరు బీమప్ప తండ్రి ఎల్లప్ప అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్య చికిత్సకు సాయమందించాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో రూ.40వేలు మంజూరు కావడంతో చెక్కును సోమవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షాన ఉంటూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు.

గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలి



కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత గ్రామ పరిసరాల్లో వాగుపై రూ.3.70 కోట్లతో ఇటీవల ఓ చెక్‌డ్యాం నిర్మించారు. అయితే వాగు నిండినప్పుడు నీరు పంటపొలాల్లోకి వెళ్లకుండా వాలుకట్టపై ఎర్రమట్టి లేదా మొరం వేయాలి. కానీ ఈ చెక్‌డ్యాంలో ఇసుకతో కూడిన మట్టి వేయడం వల్ల అది కొట్టుకుపోయి పొలాల్లోకి నీరు చేరింది. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు చెక్ డ్యాంలో నీరు నిండి పక్క పొలాల్లోకి వరద నీరు వస్తుంది. చెక్ డ్యాంను నాసిరకంగా నిర్మించడంతో తమ పంట పొలాల్లోకి నీరు చేరిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుత్తేదారుపై చర్యలు తీసుకోవడంతో పాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఆదేశించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిర్యాదుకు ఫోన్ నంబర్ ఏర్పాటు

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉన్న ప్రజలు నేరుగా 93905 40454 నంబబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పుర కమిషనర్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఫిర్యాదులను తానే స్వయంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మినర్సింహస్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం నాగదేవతల విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల మధ్య నాగదేవతల విగ్రహాలను ప్రతి ష్ఠించి సంప్రోక్షణ చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమి టీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. నాగపంచామి సందర్భంగా మళ్లీ ఆలయం ప్రాంగణంలో నాగదేవతల విగ్రహాలను పునఃప్రతిష్ఠించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, కోశాధికారి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, మాజీ సర్పంచ్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



మాగనూర్: మండలకేంద్రంలో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం ఆస్పత్రికి వైద్యం నిమిత్తం కారులో వస్తున్న సమయంలో కారు అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రికి వెళ్లే దారిలో అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

చాణక్య పాఠశాలలో ఆర్చరీ క్రీడా ప్రదర్శన

మద్దూరు: పట్టణంలోని చాణక్య పాఠశాలలో సోమవారం మహబూబ్‌నగర్‌కు చెందిన ఆర్చరీ కోచ్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఆర్చరీ క్రీడకు ఎంపిక క్రీడాకారులు రిషిత, జున్ను విలువిద్యను ప్రదర్శించారు. విద్యార్థులు కేవలం చదువుపు దృష్టి పెట్టకుండా తమకు ఇష్టమైన ఆటల్లో రాణిస్తే భవిష్యత్‌లో రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖలీల్, కరస్పాండెంట్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిల వంతెనతో అవస్థలు

- గుంతలమయంగా మారిన బ్రిడ్జి
- వర్షం వస్తే బ్రిడ్జిపై నిలుస్తున్న నీరు
- వంతెన ఎత్తు పెంచాలని కోరుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



వంతెనపై ఏర్పడిన గుంత (ఫైల్)

మాగనూర్: మండల కేంద్రలోని అడవిసత్యావార్ వాగుపై అడవిసత్యవార్-మందిపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ వంతెనపై ప్రయాణించాలంటేనే వాహనాదారులు జంకుతున్నారు. దశాబ్ద కాలంగా వంతెన మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, ప్రయాణికులు భయందోళనకు గురవుతున్నారు. ఈ వంతెనపై నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలం సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వాటర్‌తో వంతెన మునిగిపోతుండడంతో ఆ సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వంతెన ఎత్తు పెంచితే తప్ప భవిష్యత్తులో మరోసారి ఈ తరహా సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

స్పందించని అధికారులు

గతంలో వచ్చిన వరదలతో వంతెన రక్షణ గోడలు కొట్టుకుపాయాయి. వీటికి తోడు వంతెన పై మొత్తం గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీరు నిలిచి కన్పించకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. దీంతో వంతెనకు మరమ్మతు చేపట్టాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

వంతెన ఎత్తు పెంచితే మేలు..

వంతెన నిర్మాణం సమయంలో సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేదు. అప్పటి అంచాన మేరకు ఈ వంతెన కేవలం 5 అడుగుల ఎత్తులో నిర్మించారు. సంగంబండ రిజర్వాయర్‌కు భారీగా వరద వచ్చిప్పుడు తప్ప మిగతా వేళల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే వానాకాలం ప్రారంభం కావడంతో వర్షాలకు సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వరద రావడంతో వంతెన మునిగే అవకాశం ఉంది. అప్పుడు రాకపోకలు నిలిచిపోవాల్సిందే. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఒక గేట్ తెరిచి నీటిని దిగువకు వదిలారు. భవిష్యత్‌లో మిగతా గేట్లు తెరిచే అవకాశం ఉంది. అదే జరిగితే పైనున్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయి. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వంతెన ఎత్తు పెంచితే ఇబ్బందులు తప్పుతాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వంతెన (ఫైల్)

మరమ్మతు చేపట్టాలి..



పెద్దవాగుపై గల వంతెనకు మరమ్మతు చేపట్టాలి. ప్రస్తుతం ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో వంతెనపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి వంతెన సైడ్ వాల్స్ పునరుద్ధరించడంతో పాటు వంతెన ఎత్తు పెంచితే భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

–స్వామినాథ్ గౌడ్, కోల్పూర్ గ్రామస్తుడు

నూతన వంతెన నిర్మించాలి



చిన్న వర్షం పడితే వంతెనపై నీరు నిలుస్తుంది. ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో ఇంకో వాహనం పక్క నుంచి వెళ్లితే బురద ఎగిరి దుస్తులపై పడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి.

–సురేష్, అడవి సత్యావార్ గ్రామస్తుడు

ప్రతిపాదనలు పంపించాం



అడవిసత్యావార్ వంతెనతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. రాబోవు వేసవి కాలంలో అడవిసత్యావర్‌తో పాటు మందిపల్లి సమీపంలో గల గజ్జరందొడ్డి వాగుపై నూతన వంతెన నిర్మాణానికి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మాణం ప్రారంభిస్తాం

–మారుతీ, పంచాయతీరాజ్ ఏఈ

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షురాలిగా సురేఖ

నారాయణపేట రూరల్: విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షురాలిగా బందిగి సురేఖ రాంబాబు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. గతంలో పనిచేసిన డాక్టర్ రాంబాబు ఇటీవల ఆకస్మిక మరణించడంతో ఆయన సతీమణి సురేఖ పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. ఈ క్రమంలో సురేఖ రాంబాబును జిల్లా అధ్యక్షురాలిగా ప్రకటిస్తూ యాదగిరిగుట్టలో జరిగిన రాష్ట్ర ప్రాంత విశ్వహిందూ పరిషత్ సమావేశంలో రాష్ట్ర నాయకులు నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు

నారాయణపేట రూరల్: ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నూతన కమిటీలో ఇద్దరు జిల్లా వాసులకు చోటు లభించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన జనరల్ కౌన్సిల్ సభలో దామరగిద్ద మండలం ఉడ్మల్ గిద్ద గ్రామానికి చెందిన పెద్దింటి రామకృష్ణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా నారాయణపేట మండలం కోటకొండ గ్రామానికి చెందిన కోస్గి ప్రతాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.18 కోట్ల అభివృద్ధి పనులకు మంగళవారం మంత్రి డా. వాకిటి శ్రీహరి భూమిపూజ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తెలిపారు. నర్వ నుంచి జక్కన్నపల్లి రోడ్డు రూ.2.90 కోట్లు, నర్వ నుంచి రాంపూర్ గేట్ వరకు 7 కిలో మీటర్లు రూ.4.55 కోట్లు పాథర్వేడ్, నర్వలో రూ.24 లక్షలతో అంగన్‌వాడీ భవనాలు, యాంకి, నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భవనాలు రూ.40 లక్షలతో నిర్మించనుండగా మంత్రి భూమిపూజ చేస్తారన్నారు. అలాగే రూ.8 కోట్లతో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తారన్నారు.

భక్తుల ప్రత్యేక పూజలు

నారాయణపేటరూరల్: శ్రావణమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సింగర్ బేస్ శ్రీ శివ లింగేశ్వర స్వామి దేవాలయం, బారంబావి శివాలయం, గాంధీనగర్ శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ డిపోలో వైద్యశిబిరం

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం లయన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపోలో పనిచేస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 125 మంది సిబ్బందికి ఉచితంగా టెస్టులు చేసి రిపోర్ట్ అందజేశారు. కార్యక్రమంలో లయన్ కృపాకర్ రెడ్డి, వెంకటేష్, మహేష్, మధుసూదన్ రెడ్డి, రామాంజనేయులు, రవికుమార్ పాల్గొన్నారు.



అనాలోచిత నిర్ణయాలతో ప్రకృతి నాశనం

కోస్గి: మానవుని అనాలోచిత చర్యలతోనే ప్రకృతి నాశనం అవుతుందని యంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త మల్లేశం అన్నారు. సోమవారం ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'సుస్థిర అభివృద్ధి ద్వారా.. ప్రకృతి సంరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవరాశుల మనుగడకు అవసరమయ్యే గాలి, నీరు, ఆహారం ప్రకృతి ద్వారానే లభిస్తాయన్నారు. ఆధునీకరణ, పారిశ్రామీకరణ, నగరీకరణ, కార్పొరేటీకరణ ప్రకృతి స్వచ్ఛతను పాడు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖలు పోటీలు నిర్వహించి ప్రకృతి పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఎర్త్ క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.



పర్యావరణ చిత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

సేవాగుణాన్ని అలవరుచుకోవాలి



లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఊట్కూరు: ప్రతి ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని సేవా రత్న లయన్ డాక్టర్ నటరాజు అన్నారు. సోమవారం ఊట్కూరులో లయన్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదల కోసం ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా హనుమంతు, కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా కృష్ణార్జునరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నాయకులు హరినారాయణబట్టడ్, శశికాంత్, జనార్ధన్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, వంశీరెడ్డి, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, వసంత్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మాగనూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని వడ్వాట్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. తర్వాత వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు రోజూ ప్రార్థన సమయానికి తప్పకుండా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురురాజారావు, ఏపీఓ మన్యం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైన్స్‌ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

పాడవుతున్నా పట్టించుకోరా?



మండల కేంద్రంలో అన్నదాతలు వ్యవసాయానికి ఉపయోగించే కేజీవీల్స్‌తో రోడ్లపై వెళ్తుండటంతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. బీటీ, మెటర్ రోడ్ల నిర్మాణంలో ఒక పక్క నాసిరకం పనులతో కొద్ది రోజులకే రోడ్లు శిథిలమవుతుండటంతో దీనికి తోడు వాటి పైనే రైతులు యథేచ్ఛగా భారీ ఇనుప వాహనాలను తీసుకెళ్తుండడంతో మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. ఈ విషయంపై ఇటు పోలీసులు, అటు పంచాయతీ రాజ్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేజీవీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – మాగనూర్

బకాయి బిల్లులు చెల్లించాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాలుగు నెలలుగా కార్మికుల వేతనాలు, ఎనిమిది నెలల నుంచి వంట బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అప్పులు తెచ్చి పిల్లలకు భోజనాలు పెడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక బిల్లులను ఈ కుబేర్ నుంచి కాకుండా గతంలోని గ్రీన్ ఛానల్ నుంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం అందించి, ప్రైవేటీకరణ చర్యలను నిలుపుదల చేయాలని కోరారు. వంట గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జయంతి, బాలమణి, వెంకటమ్మ, యాదమ్మ, అనిత, వెంకటేష్, మణెమ్మ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

అలుగు పునర్నిర్మించి ఆదుకోండి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ మల్లెలోని చెరువు అలుగు పునర్నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్, ఇరిగేషన్ కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. గతంలో అధికంగా వర్షాలు పడటం వలన అలుగును తొలగించారని, దీంతో చెరువు లోని నీరు మొత్తం బయటికి పోయిందన్నారు. తిరిగి అలుగు పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు చెరువులో నిలవ ఉండటం లేదని, వెంటనే అలుగు పనులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసింహ, వెంకటరాములు, రాములు, దస్తప్ప, రఘు, లక్ష్మయ్య, వెంకటేష్, నర్సింములు, రాములు, బాలు, అంజి, శ్రీను పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న రైతులు

రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

నారాయణపేట: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఆశయాలను మనమందరం ముందుకు తీసుకెళ్దామని రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కోఆర్డినేటర్ కిరణ్ మూగబసవ కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన కృషి వల్లనే నేడు గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ తరఫున పోటీ చేసే ప్రతి ఒక్కరు రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండి. సలీం, ఆర్జీపీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్ మూగబసవ

మఠం భూములను కాపాడండి

నారాయణపేట రూరల్: మండలంలోని అంతారం, కొల్లంపల్లి, అయ్యవారిపల్లీ, లింగంపల్లి శివారులో ఉన్న కర్ణాటక రాష్ట్రం హంపి పీఠం భూములను కాపాడుకుందామని బీజేపీ నాయకులు రఘువీర్ యాదవ్ కోరారు. ఈ మేరకు భక్తజన మండలి సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. భూభారతి చట్టంలో భాగంగా కొందరు రైతులు ఆయా భూములను దొంగ సాదా బైనామాతో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు ఆరోపించారు. ఆయా భూములను పరిశీలించి హంపి మఠం పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

నర్వ: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ జనరల్ సెక్రెటరీ నాగన్నగారీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ తప్పకుండా ఇంఇరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనువాసులు, ఏఈ వినయ్‌కుమార్, మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్యసాగర్ కాంగ్రేస్ పార్టీ మండల నాయకులు నాగన్నగారీ వివేకవర్ధన్‌రెడ్డి, నాయకులు భట్టుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు నూతన భవనం నిర్మించండి

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో కొత్త భవనాన్ని నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.తరగతి గదుల పెచ్చులు ఊడిపడితుండడంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

ఎంపీని ఆహ్వానించాలి

నర్వ: కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఎంపీ డీకే అరుణను ఆహ్వానించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ శ్రీనువాసులకు వినతి పత్రం అందించారు. కేంద్రప్రభుత్వ ఎన్ఆర్ఈజీఎస్, పీఎంజీఎస్‌వై, ఎంపీ లాడ్స్ నిదుల ద్వారా మండలంలో నిర్మించే గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు ఎంపీ డీకే అరుణతో భూమిపూజ చేయించాలన్నారు. అలాగే శిలాఫలకాలపై ఎంపీ పేరును ముందు వరుసలో ఉంచాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి, మండల నాయకులు విజయ్‌రామ్, వెంకటేష్, అయ్యప్పస్వామి ఉన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి



నారాయణపేట రూరల్: మండలంలోని బొమ్మన్‌పాడు గ్రామంలో కుక్కలు దాడి చేసిన ఘటనలో మేకలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలకిష్టప్ప అనే రైతు తన మేక పిల్లలను రోజులాగే సోమవారం ఇంటి ముందు జాలిలో కట్టి పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో అటుగా వచ్చిన కుక్కల గుంపు అందులోకి చొరబడి దాడి చేయడంతో 10 మేక పిల్లలు మృతి మరణించాయి. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

కనీస వేతనం మంజూరు చేయాలి

అమరచింత: కేజీబీవీల్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు మంజూరు చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మండలంలో కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందిని సోమవారం ఆయన కలుసుకొని వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.26వేల ఇవ్వడమే కాకుండా ఒప్పందం కార్మికులకు రెగ్యులర్ చేయాలన్నారు. దశాబ్దాలుగా కేజీబీవీ వర్కర్స్ శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఏ విధమైన జీవోలను నాన్ టీచింగ్ సిబ్బందికి అమలు కావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో అనురాధ, శోభ, నందిని, చంద్రకళ, అంజనమ్మ, తాహేరా, విమల పాల్గొన్నారు.

30న మందకృష్ణ రాక

అమరచింత: ఈ నెల 30న ఆత్మకూర్ పట్టణానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ రానున్నారని జిల్లా అధ్యక్షుడు జంగయ్య తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బుధవారం ఆత్మకూర్ పట్టణంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొంటారని వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శ్యాం, ప్రకాశం, ప్రేమ్, లచ్చన్న, రఘు, శేఖర్, సైమన్, రవి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

దేవరకద్ర రూరల్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి సూచించారు. సోమవారం హజీలాపూర్‌లో మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హనుమంత్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీకాంత్, సురేందర్, రాంబాబు, చంద్రమౌలి, పూర్ణిత, జవహర్, గ్రామాధ్యక్షుడు కన్నయ్య, జగన్నాథ్, ప్రతాప్ పాల్గొన్నారు.